నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, గురువారం 6 ఫిబ్రవరి 2025 | HYDERABAD



## సీఎంకు వినతి

అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములను ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మల్కాజిగిరి నియోజకవర్గంలో పేదలు నివసిస్తున్న భూదాన్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములు, దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను జీవో నం. 118 ప్రకారం రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ.. వినతిపత్రం అందజేశారు.

-మల్కాజిగిరి, ఫిబ్రవరి 5



మేడ్చల్ మండలం శ్రీరంగవరం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన కుమ్మరిగడ్డలో కొన్ని రోజులుగా తాగునీటి కటకట ఏర్పడినా పట్టించుకోవడం లేదని ఆగ్రహంతో గ్రామ మహిళలు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. తమ గ్రామంలో రెండు నెలలుగా మంచినీళ్లు రాక అష్టకష్టాలు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తమకు నీళ్ల ఇబ్బంది ఉండేది కాదని, కానీ నేడు తాగేందుకు నీరు లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

- మేడ్చల్ రూరల్, ఫిబ్రవరి 5:




# వినియోగదారులకు షాక్!

### అనుమతి ఉన్న అంతస్తులకే రెగ్యులర్ విద్యుత్
### అనుమతి లేనివాటిని టెంపరరీకి మార్పు
### మూడింతలు పెరగనున్న విద్యుత్ చార్జీలు
### గ్రేటర్‌లో సుమారు 10 లక్షల కనెక్షన్లపై ప్రభావం



సిటీబ్యూరో: గ్రేటర్‌లో విద్యుత్ వినియోగదారులకు టీజీఎస్పీడీసీఎల్ పెద్ద ఎత్తున షాక్ ఇవ్వనున్నది. ఒకవైపు చార్జీలు పెంచమని చెబుతూనే.. నిబంధనల పేరుతో సరికొత్త మార్గాల్లో వినియోగదారులపై ఆర్థికభారం పడేలా చేస్తోంది. గ్రేటర్‌లో మొత్తం 62 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 52 లక్షల వరకు డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. భవన నిర్మాణాల సమయంలో అధికారులు టెంపరరీ కనెక్షన్లు ఇచ్చి నిర్మాణం పూర్తయిన తరవాత వాటిని రెగ్యులరైజ్ చేయడం డిస్కంలో సహజంగా జరుగుతుంది. వినియోగదారులు దరఖాస్తు చేసుకోగానే మూడు రోజుల్లో ఏఈ క్షేత్రస్థాయి విచారణ జరిపి టెంపరరీ కనెక్షన్‌ను రెగ్యులరైజ్ చేస్తారు. ఈ ప్రక్రియ కూడా ప్రస్తుతం ఆలస్యంగానే జరుగుతుండగా.. తాజాగా ఎస్పీడీసీఎల్ తీసుకుంటున్న నిర్ణయం వినియోగదారులపై పెద్ద ఎత్తున ఆర్థిక భారం మోపనున్నది. గ్రేటర్‌లో మూడంతస్తుల నుంచి ముప్పై అంతస్తుల వరకు ఇండ్లు ఉన్నాయి. వీటిలో చాలా వాటికి కొన్ని ఫ్లోర్ల వరకే అనుమతులు ఉన్నాయి. ఇండ్లకు కనెక్షన్లు ఇచ్చే సమయంలో ఆక్యుపెన్సీ విషయాన్ని విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల ఇప్పటికిప్పుడు ఈ భారం వినియోగదారులపై పడుతున్నది. కాగా, జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ పరిధిలో ఉన్న ఇండ్లలో ఎన్నింటికీ పర్మిషన్లు ఉన్నాయి.. అందులో ఎన్ని అంతస్తులకు పర్మిషన్లు ఉన్నాయి.. ఎన్ని కనెక్షన్లు ఉన్నాయి. అందులో ఎన్ని కనెక్షన్లు టెంపరరీగా మార్చవచ్చనే దిశగా క్షేత్రస్థాయిలో ఎస్పీడీసీఎల్ సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఆక్యుపెన్సీ లేకుండా ఇచ్చిన కనెక్షన్లకు నోటీసులు ఇచ్చి వాటిని టెంపరరీలోకి మార్చడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ ప్రభావం గ్రేటర్‌లో సుమారుగా 8 నుంచి 10 లక్షల మంది విద్యుత్ వినియోగదారులపై పడనున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వీరి కనెక్షన్లు రెగ్యులర్ నుంచి టెంపరరీ కేటగిరీ మారితే యూనిట్ రేట్ పెరుగుతుంది. ప్రస్తుతం యూనిట్ ధర రూ.5 ఉండగా.. టెంపరరీలో యూనిట్ ధర రూ.11పైనే భారం పడుతుందని అంచనా.

### సమ్మర్‌లో మరింత ఎక్కువ..

వేసవిలో విద్యుత్ వినియోగం పెరగనున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో సాధారణంగా వచ్చే బిల్లే పెరిగితే కేటగిరీ మార్చి యూనిట్‌కు రెండు నుంచి మూడురెట్ల చార్జీ చేస్తే వినియోగదారుడి పరిస్థితి ఏంటనేది ప్రశ్న. ఈ కేటగిరీలకు సంబంధించి ఎవరైనా ప్రశ్నించాలనుకున్నా వారికి రెగ్యులరైజ్ చేసుకోమన్న సమాధానమే వస్తుందట. తమ మీటర్ టెంపరరీ కేటగిరీ నుంచి రెగ్యులరైజ్ చేయమని ఏఈ, డీఈల దగ్గరికి వెళ్తే కార్పొరేట్ ఆఫీస్ వరకు వెళ్లాల్సి వస్తుందని వినియోగదారులు అంటున్నారు. కేటగిరీ మార్పు విషయంలో గత ప్రభుత్వంలో వారం రోజుల్లోపే పనులు జరిగితే ఇప్పుడు మాత్రం మూడు నాలుగు నెలలైనా మార్చడం లేదని, తమపై బిల్లుల భారం ఎక్కువవుతున్నదని చెప్పారు. తాజాగా డిస్కం తీసుకుంటున్న నిర్ణయంతో 10 లక్షల మంది వినియోగదారులపై ఆర్థికభారం అధికంగా పడడమే కాకుండా వారికి ఈ మూడు నెలల పాటు రెగ్యులరైజ్ చేయించుకునేందుకు కూడా అధికారులు, సిబ్బంది సహకరించరన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# హైడ్రా కూల్చివేతలు

### రహదారులపై అడ్డుగా ఉన్న గోడలను కూల్చేసిన అధికారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): నగరంలో పలు చోట్ల బుధవారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. కాప్రా మున్సిపాలిటీల్లో రాకపోకలకు అడ్డుగా ఎన్‌ఆర్‌ఐ కాలనీ వారు నిర్మించిన ప్రహరీని తొలగించింది. శంషాబాద్ మండలం రాళ్లగూడ గ్రామం వద్ద ఔటర్‌రింగ్ రోడ్డును చేరేందుకు వీలు లేకుండా రహదారులకు అడ్డంగా నిర్మించిన ప్రహరీని హైడ్రా సిబ్బంది కూల్చేశారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురిలో ఆర్మీ ఆఫీసర్ల కాలనీకి అడ్డుగా నిర్మించిన 50 మీటర్ల ప్రహరీని హైడ్రా తొలగించింది. ఇదే సర్కిల్ పరిధిలో ఉన్న డిఫెన్స్ కాలనీలో సర్వే నంబర్ 218/1లో ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలం కబ్జా అయిందంటూ హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ రంగనాథ్ చెప్పారు. దాదాపు 1200 గజాల స్థలాన్ని స్థానిక అసోసియేషన్ పెద్దలు ప్లాట్లుగా చేసి విక్రయించారంటూ.. వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. డిఫెన్స్ కాలనీ నివాసితుల ఫిర్యాదు మేరకు స్థానిక అధికారులతో కలిసి హైడ్రా విచారించగా, స్థలాన్ని ఐదు ప్లాట్లుగా చేసి కొన్నింటిని అమ్మారని, మరికొన్నింటిని వారి ఆధీనంలోనే ఉంచుకున్నట్లు నిర్ధారించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఈ కబ్జాలను తొలగించి ప్రజా అవసరాలకు ఉద్దేశించిన జీహెచ్‌ఎంసీ సీ ల్యాండ్‌గా పేర్కొంటూ ప్రొటెక్టెడ్ బై హైడ్రా అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



### ప్రజావాణిలో ఫిర్యాదుతో..

కూకట్‌పల్లి-నిజాంపేట రోడ్డులోని హోలిస్టిక్ ఆస్పత్రి వెనుక ప్రభుత్వ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీని హైడ్రా తొలగించింది. అదే స్థలంలో తనకు కేటాయించిన 300 గజాల స్థలం ఉందని, ఓ మాజీ సైనికుడు హైడ్రా ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో 1253 గజాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్లు తేలింది. దీంతో స్థలం చుట్టూ ఉన్న ప్రహరీని హైడ్రా తొలగించింది. చుట్టుపక్కల కాలనీలకు దారులను మూసేస్తూ కాలనీల చుట్టూ ప్రహరీలు నిర్మిస్తే కూల్చివేత తప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు.

## విమానంలో సాంకేతికలోపం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి వెళ్లాల్సిన అలెన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం (91877) బుధవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సి ఉంది. అయితే.. చివరి నిమిషంలో ఎయిర్‌లైన్స్ అధికారులు విమానంలో సాంకేతికలోపం తలెత్తినట్లు సమాచారం ఇచ్చారు. అప్పటికే ఎయిర్‌పోర్టులోకి చేరుకున్న 40 మంది ప్రయాణికులు దాదాపు 8.30 గంటల వరకు వేచిచూశారు. ఎయిర్‌లైన్స్ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగారు. తిరుమల దర్శనం కోసం వెళ్తున్న ప్రయాణికులకు తిరుమల దర్శనం సమయం ముగియడంతో ఎయిర్‌లైన్స్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విమానాన్ని పూర్తిగా రద్దు చేశారా? లేక ఏదైనా ఏర్పాట్లు చేశారా? అనే విషయంపై ఎయిర్‌పోర్టు అధికారులను వివరణ కోరే ప్రయత్నం చేయగా, వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



## 'నల్సార్' క్యాంటీన్‌లో సర్వం కల్తీ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : శామీర్‌పేటలోని నల్సార్ విశ్వ విద్యాలయంలో టాస్క్‌ఫోర్స్ (ఫుడ్ విభాగం) బృందం తనిఖీలు నిర్వహించింది. విశ్వ విద్యాలయ ప్రాంగణంలోని శ్రీ సాయి గణేశ్ క్యాటర్స్ (క్యాంటీన్)ను పరిశీలించింది. స్టోర్ రూంలో ఎలుకల మలం, బొద్దింకల బెడద ఉన్నట్లు గుర్తించింది. లేబుల్ చేయని 90 కిలోల పిండి పదార్థాలను సీజ్ చేశారు. ఫుడ్ తయారీ ప్రాంతం, డైనింగ్ ఏరియాలో అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నట్లు తేల్చారు. గ్రేవీ కూరలకు ఉపయోగించే సీతాఫలం గింజలు పురుగులు పడినట్లు గుర్తించి, 20 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. గడువు ముగిసిన 30 కిలోల పప్పును సీజ్ చేశారు. సంబంధిత క్యాంటీన్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు.

# ఎల్బీనగర్‌లో దారుణం..

### సెల్లార్ కూలిన ఘటనలో ముగ్గురు దుర్మరణం
### మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. స్థల యజమానులు, బిల్డర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం
### సెల్లార్ తవ్వకం సరిగ్గా చేపట్టకపోవడం వల్లే దుర్ఘటన
### బిల్డర్, స్థల యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బల్దియా అధికారులు



ఆలకుంట్ల వీరయ్య (ఫైల్)
ఆలకుంట్ల రాము (ఫైల్)
ముద్దంగుల శ్రీనివాస్ (ఫైల్)

సిటీబ్యూరో/మన్సూరాబాద్: బహుళ అంతస్తుల నిర్మాణం కోసం తవ్విన డబుల్ సెల్లార్ మట్టిదిబ్బలు కూలిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి చంద్రపురికాలనీలోని గ్రాండ్ సితార హోటల్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు పక్కన చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్‌కు చెందిన కుసుమ రమేశ్, కుసుమ విజయతో పాటు బిల్డర్ సిద్ధం సాయినాథ్ అనే వ్యక్తులు చంద్రపురికాలనీలోని సర్వే నం. 59, ప్లాట్ నం. 36, 37 పార్ట్ అండ్ 37లోని 1335.26 స్కైర్ మీటర్లలో ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ హెడ్ ఆఫీస్ నుంచి అనుమతులు పొందారు. డబుల్ సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మరో నాలుగు అంతస్తులు వేసుకునేందుకు 23 డిసెంబర్ 2024లో అనుమతులు లభించాయి. సదరు భూమిలో డబుల్ సెల్లార్ తవ్వారు. పిల్లర్ల నిర్మాణాల కోసం బేస్ వేసే పనిని ఇటీవల చేపట్టారు. పిల్లర్లలో కాంక్రీట్‌ను నింపే పని కోసం కొందరు కూలీలు బుధవారం ఉదయం చంద్రపురికాలనీలో నూతనంగా నిర్మిస్తున్న భవనం సెల్లార్ వద్దకు చేరుకున్నారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం, మల్లుపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట్ల వీరయ్య (50), ఆలకుంట్ల రాము (20), ముద్దంగుల శ్రీనివాస్ (19) జీవనోపాధి కోసం నగరానికి వచ్చి ఆరేండ్లుగా పెద్ద అంబర్‌పేటలో నివాసముంటూ కూలీ పని చేస్తున్నారు. ఆలకుంట్ల వీరయ్య, రాము తండ్రి కొడుకులు కాగా.. శ్రీనివాస్, వీరయ్య చెల్లెలి కొడుకు. రెండు సంవత్సరాల కిందట సోదరి మృతి చెందడంతో శ్రీనివాస్‌తో పాటు అతడి సోదరుడైన శ్రీరామ్‌ను వీరయ్య తన వద్దే ఉంచుకున్నారు. శ్రీనివాస్‌ను తనతో పనికి తీసుకెళ్తుండగా.. శ్రీరామ్ చదువుకుంటున్నాడు. వీరయ్య, రాము, శ్రీనివాస్‌తో పాటు నల్గొండ జిల్లా, చింతపల్లి మండలం, గ్రామానికి చెందిన భిక్షపతి (33) మరో ఇద్దరు వ్యక్తులు బుధవారం ఉదయం 9 గంటలకు పని కోసం చంద్రపురికాలనీలో సెల్లార్ వద్దకు చేరుకొని పిల్లర్లలో కాంక్రీట్‌ను నింపే పనిలో నిమగ్నమయ్యారు. సుమారు 10 గంటల సమయంలో ఒక్క ఉదుటున సెల్లార్ పై భాగంలోని మట్టి దిబ్బలు కూలి వీరయ్య, రాము, శ్రీనివాస్, భిక్షపతిపై పడ్డాయి. మట్టి దిబ్బల కింద నలుగురు కూరుకుపోయారు. సెల్లార్‌లో కొద్ది దూరంలో వేరే పనిలో నిమగ్నమై ఉన్న ఇద్దరు కూలీలు బయటకు పరుగెత్తుకొచ్చారు. విషయాన్ని గ్రహించిన సూపర్‌వైజర్ ఎల్బీనగర్ ట సమాచారం ఇచ్చారు. పోలీసులతో పాటు డీఆర్‌ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకొని మట్టి దిబ్బలను తొలగించారు. సుమారు 10 ఫీట్ల మట్టి కింద కూరుకుపోయిన వీరయ్య, రాము, శ్రీనివాస్, భిక్షపతిని బయటకు తీయగా.. ఊపిరి ఆడక వీరయ్య, రాము, శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన భిక్షపతిని ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

### పరిహారం అందజేయాలి

**-ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

సెల్లార్ మట్టి దిబ్బలు పడి ముగ్గురు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం ఎల్బీనగర్ కామినేని దవాఖానలో చికిత్స పొందుతున్న భిక్షపతిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తికి ఒక్కొక్కరికీ రూ. 25 లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ. 10 లక్షల చొప్పున నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

### ముగ్గురు చనిపోవడం దురదృష్టకరం

**-జోనల్ కమిషనర్, హేమంత కేశవ్ పాటిల్**

సెల్లార్ గోడ కూలిన ఘటనలో ముగ్గురు వ్యక్తులు చనిపోవడం ఒక వ్యక్తి గాయపడటం ఎంతో దురదృష్టకరమని జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. వీరయ్య, రాము, శ్రీనివాస్ మృతి చెందిన విషయాన్ని జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, నగర మేయర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

### చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

చంద్రపురికాలనీలోని సర్వే నం. 59, ప్లాట్ నం. 36, 37 పార్ట్ అండ్ 37లోని 1335.26 స్కైర్ మీటర్లలో నిర్మిస్తున్న భవనానికి 23 డిసెంబర్ 2024లో కుసుమ రమేశ్, కుసుమ విజయతో పాటు బిల్డర్ సిద్ధం సాయినాథ్ అనే వ్యక్తులు అనుమతులు తీసుకుని భద్రతా చర్యలు చేపట్టకుండా నిర్మాణాలు జరిపారని జీహెచ్‌ఎంసీ అధికారులు ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ముగ్గురు మృతికి కారణమైన ప్లాటు యజమానులతో పాటు బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై బిల్డింగ్ యజమానులకు, బిల్డర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చే వరకు బిల్డింగ్ అనుమతులను రద్దు చేస్తున్నట్లు తెలిపారు.


### సెల్లార్ తవ్వకాల్లో నిబంధనలు తూచ్..

ఇటీవల కాలంలో పుప్పాలగూడ గోల్డెన్ ఓరియల్ అపార్ట్‌మెంట్‌లో సిలిండర్ పేలి అగ్ని ప్రమాద ఘటన, సిద్ధిఖీనగర్‌లో నెలకు ఒరిగిన నాలుగు అంతస్తుల నిర్మాణం ఘటన మరుకముందే ఎల్బీనగర్‌లోని మన్సూరాబాద్‌లో కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణ పనుల సెల్లార్ తవ్వకాల సందర్భంగా నిర్మాణదారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టని ఫలితంగా ముగ్గురు కూలీలు దుర్మరణం చెందారు. మరొకరు గాయాలపాలై దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో సదరు నిర్మాణదారులు అడ్డగోలుగా సెల్లార్ తవ్వకాలు జరుపుతున్నట్లు తేలింది. వాస్తవంగా సెల్లార్ తవ్వకాలు, నిర్మాణ సమయంలో కచ్చితంగా సెట్ బ్యాక్‌లు వదిలి పెట్టాలి. ముఖ్యంగా రక్షణ గోడలు కడుతూ సెల్లార్ పనులు చేపట్టాలి. కచ్చితంగా సైట్ ఇంజినీర్ పర్యవేక్షణ, ప్లానింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ ఉండాలి. కానీ నిబంధనలకు నిర్మాణదారులు నీళ్లొదిలారు. తలా పాపం తిలా పిడికెడు అన్నట్లు నిర్మాణదారులు, అధికారుల పర్యవేక్షణ లేమితో ముగ్గురు అమాయక కార్మికులను పొట్టన పెట్టుకున్నారు. కాగా, ఎల్బీనగర్ ఘటనలో అధికారులు సెల్లార్ తవ్వకాల్లో నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంటూ సదరు నిర్మాణ అనుమతి రద్దుతో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో యజమానులపై క్రిమినల్ కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు. కాగా, నిబంధనలు ఉల్లంఘించే నిర్మాణదారులపై ఉక్కుపాదం మోపేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ గడిచిన కొన్ని నెలలుగా క్షేత్రస్థాయిలో ఈ టాస్క్‌ఫోర్స్‌లో చలనం లేదు.

## డ్రామాలాడుతున్న కాంగ్రెస్ సర్కారు

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా డ్రామాలు ఆడుతున్నదని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సమావేశపు హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం లేదని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నట్లు స్పష్టమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, డైరెక్టర్ పొట్టి ఆనంద్, మాజీ మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి-షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



## గ్రేటర్ @ 34.2 డిగ్రీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి నమోదవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.2, కనిష్ఠ 18.9 డిగ్రీలు, గాలిలో తేమ 37శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.